డిటెక్టివ్ స్టోరీ


# వాత పెట్టిన వజ్రం

వి.ఎస్. రావ్

**'మహారాజా' మంచం మీద ఆమె యువరాణిలా పడుకుంది. నేల మీద పాకుతున్న అందాల తీగలా, వయ్యారంగా వొంపులు తిరుగుతూ పాకి, విశ్రాంతి తీసుకుంటున్న నాగకన్యలా ఉందామె శయనభంగిమ. పచ్చని ఆకుల డిజైన్‌తో చూడ చక్కగా ఉన్న చీర...ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ప్రాణం పోసుకుంటూ సమ్మోహన కరంగా కదుల్తున్న ఆకులు...అతని చూపులు పైకి పాకాయి. చందమామ ముఖం, ముఖం చుట్టూ గుండ్రటి విసనకర్రలా పరుచుకున్న బాబ్డ్ హెయిర్...**

**ఆమె 'నిద్రా సౌందర్యం' అతన్ని అయస్కాంతంలా లాగుతోంది. అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ఆమె శరీరం వెదజల్లుతున్న అయస్కాంతశక్తిని నిరోధిస్తూ, అతను సిగరెట్ వెలిగించాడు. ఆమె ముఖం మీదే తన చూపుల్ని తాపడం చేసి పొగ ఉంగరం ఊదాడు. బిగ్గరగా నవ్వాలనిపిస్తోందతనికి.**

**ఆమెది నిద్రకాదు. నిద్రాభినయం. ఆమెది నిద్రా సౌందర్యం కాదు, నిద్రాభినయ సౌందర్యం.**



''హనీ! లే!'' మంచాన్ని సమీపిస్తూ అన్నాడతను.

ఆమెలో చలనం లేదు. ఆమెలో ఉందీ, కంటికి కనిపిస్తోందీ ఒక్కటే, ఉచ్ఛ్వాస నిశ్వాసాల లయ విన్యాసం.

''హనీ! నువ్వు నిద్రపోనప్పుడు అందంగా ఉంటావు. నిద్రపోతున్నప్పుడు ఇంకా అందంగా ఉంటావు. నిద్ర నటిస్తున్నప్పుడు ఇంకా...ఇంకా...''

''అందంగా ఉంటాను'' అతని మాటను పూర్తి చేస్తూ తటాలున లేచి, కూచుందామె. ఉచ్ఛ్వాస నిశ్వాసాల తాకిడిని తట్టుకోలేనట్టుగా, ఆమె పైట కిందికి జారింది.

అతను ఆమె దగ్గరగా జరిగి, ముందుకి వంగాడు. మంచం మీద పడి ఉన్న పైటను తీసి, ఆమె భుజాల చుట్టూ కప్పాడు.

''నన్ను నిద్రలో, ఈ గదిలో వదిలేసి, ఎక్కడికెళ్లావ్?'' అందామె-లత-కోపం నటిస్తూ.

జవాబుగా అతను పొగ ఉంగరం వదిలాడు.

''ఎందుకెళ్ళావ్?'' లత గద్దిస్తున్నట్టు అంది. అతని కుడిచెయ్యి కోటు జేబులోకి వెళ్ళి ఇవతలకి వచ్చింది. విలాసంగా కదిలింది. ఎర్రటి చిన్నపెట్టె లత వొళ్ళో పడింది. పెట్టెను చుట్టిన ఎర్రటి వెల్‌వెట్‌ను చూడగానే లోపల ఏదో నగ ఉందని ఊహించేసింది లత. ఆమె పెట్టెను అందుకుని, ఆత్రంగా తెరిచింది. లోపల పడుకున్న నగ జిగేల్‌మంది.

''వావ్! బ్యూటీ!'' అంటూ లత నగని ఇవతలకి తీసింది. కుడి అరచేతిలో ఉంచుకుంది. ఐదుమొనల బంగారు నక్షత్రం మధ్య మెరిసిపోతున్న వజ్రం. లత ముఖం ఆనందాన్ని వెదజల్లుతూ శివరామ్ వైపు పైకి లేచింది.

''డార్లింగ్...ఎంత?''

అరచేతిలోని ఆభరణం చూపిస్తూ అడిగింది లత.

''ఐదు వందల సంవత్సరాలు...''

''ఏమిటి?'' లత కంఠంలో ఆశ్చర్యం.

''దాని వయసు హనీ! నిజంగా ఐదువందల ఏళ్లు! శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. తెలీదు నీకు? హంపీ విజయనగర వీధుల్లో రత్నాలు, ముత్యాలూ రాసులు పోసి, అమ్మేవారు. ఈ కర్ణాభరణం ఆనాటి రాణివాసం మహిళల చెవిని అలంకరిం

చిందనంటున్నాడు, షాపతను. తరాలు మారే కొద్దీ చేతులు మారుతూ, ఇన్నాళ్ళకి 'నవరత్న మందిర్' సేఠ్‌గారి చేతికి వచ్చింది. ఈనాటికి నీ అరచేతిలో వాలి, అందాలు చిందిస్తోంది.''

''ఈ కథంతా ఎవరు చెప్పారు నీకు?'' లత చిరు నవ్వుతో ప్రశ్నించింది.

''ఇది కథ కాదు. నాకు ఎవరో చెప్పింది కాదు. 'హైసొసైటీ' టీవిలో 'అమూల్య రత్నాలూ, ఆణిము త్యాలూ' అనే ప్రొగ్రాంలో 'నవరత్న మందిర్' సేఠ్ చెప్పాడు. యాంకరమ్మాయి చెప్పింది. చారిత్రాత్మక మైన ఈ కర్ణాభరణాన్ని కొనాలనీ, సొంతం చేసుకోవా లనీ రాత్రి ప్రొగ్రాం చూడగానే నిర్ణయించుకున్నాను. ఉదయమే షాపు ముందు తిష్ట వేసి, షాపు తెరవగానే అడిగినంతా ఇచ్చి సొంతం చేసుకొన్నాను.''

''ఎంత?'' లత ముక్తసరిగా అడిగింది.

''మూడు లక్షలు...''

''వాట్? ఇంత చిన్న నగ...మూడు లక్షలా?''

''మైడియర్ పూర్ గర్ల్! అది సాదాసీదా సరుకు కాదు. డైమండ్ ఇయర్ పీస్! పైగా రాయలవారి రాణివాసంలో వెలిగింది'' శివరామ్ నవ్వాడు.

లత నిర్లక్ష్యంగా నగని మంచం మీద పడేసి పెదవి విరిచింది. శివరామ్ కళ్లు చిట్లించాడు.

''ఏం నచ్చలేదా?''

''ఎలా నచ్చాలి? ఎందుకు నచ్చాలి?'' లత ఎదురు ప్రశ్న వేసింది. ''ఒక చెవికి పెట్టుకోనా?''

''అది యాంటిక్ ఆర్నమెంట్. ఉన్నది ఆ ఒక్కటే! మనం కొన్నదీ ఆ ఒక్కటే!''

''నాకు రెండూ కావాలి'' లత మారాం చేస్తు న్నట్లు అంది. ''రాయలవారి రాణివాసంలో వెలుగులు చిమ్మిన ఈ ఆర్నమెంట్ సెట్టు నా చెవుల్లో ధగధగలాడాలి.

''ఉంటేగా, హనీ ఆడడానికి?'' శివరామ్ నవ్వాడు.

''ఉంటుంది డార్లింగ్! నీకు తెలీదు! ఇద్దరు కస్టమర్లకి విడివిడిగా అమ్మి సొమ్ము చేసుకోవడానికి షాపువాడు ఒకటి దాచేసి ఉంటాడు! ఇదేమన్నా నెక్లెసా? వడ్డాణమా...ఒక్కటే ఉండడానికి? ఇయరార్నమెంట్స్‌ఎప్పుడూ ఒకటిగా ఉండవు, డార్లింగ్...జంటగా ఉంటాయి.''

''వై డోంట్ యూ అండర్‌స్టాండ్?''

''బికాస్..నాకు ఇష్టం లేదు. అర్థం చేసుకోను. వెళ్ళి దీని జత కొనుక్కురా!'' లత మొండిగా అంది.

శివరామ్ నిట్టూర్చాడు. ''ఒక పని చెయ్! నువ్వే ఆ షాపుకెళ్ళు. రెండో ఇయర్‌పీస్ కావాలను. అవసరమైతే ఎక్కువ రేటు ఆఫర్ చేయ్!''

''ఎంత?'' లత మంచం మీంచీ దిగుతూ అడిగింది.

''దీనికి మూడున్నరిచ్చాను. నాలుగు, ఐదు...కావాలంటే...అరు ఆరులక్షల్దాకా ఆఫర్ చేయ్....''

''ఏంటలా రెచ్చిపోతున్నావ్.'' లత నవ్వుతూ అడిగింది.

''కారణాలు రెండు...'' శివరామ్ అన్నాడు. ''ఒకటి నీ ముచ్చట తీర్చడం! రెండు ఏడాది తిరగక ముందే మూడింతలకి అమ్మి సొమ్ము చేసుకోవడం. బంగారం రేటు, నవరత్నాల రేట్లు రోదసిలోకి దూసుకెళ్తున్నాయ్!''

''ఓకే! ఎంత ధరైనా పారేసి, కొనేస్తానేం?''

''గుడ్‌లక్!'' శివరామ్ నవ్వాడు. ''ఇదిగో షాపు వాడి బిజినెస్ కార్డ్!''

లత ఆదరా బాదరా పక్కగదిలోకి దూరి, తలుపు మూసింది. శివరామ్ సిగరెట్ వెలిగించాడు. తను ఎంత మొత్తుకున్నా లత నమ్మదు. షాపు వాడు చెప్తే వింటుంది. నమ్ముతుంది.

గది తలుపు తెరుచుకొని లత ఇవతలకి వచ్చింది. నిన్న కొన్న సల్వార్ కమీజ్‌లో ఆమె అందం వెయ్యింతలైంది.

''ఎలా ఉంది?'' లత ఉల్లాసంగా అడిగింది.

''ఏమిటి?'' శివరామ్ ప్రశ్నించాడు.

''డ్రెస్!''

''అది నీ అందాన్ని మల్టిప్లై చేస్తోంది! అన్నట్టు దుపట్టా ఏది?'' శివరామ్ ఆమెను రెప్పవేయకుండా చూస్తూ అడిగాడు.

''నాకు నచ్చదు. ఇలాగే బావుంది నాకు!''

''పిచ్చి పిల్లా... నీ డ్రెస్సు నచ్చాల్సింది నీ కళ్ళకు కాదు, చూసేవాళ్ళ కళ్ళకు! 'దుపట్టా' అనే అంగవస్త్రం-నిజానికి అంగవస్త్రం కాదు, అనంగ వస్త్రం....''

''అనంగ వస్త్రమా?! అంటే?''

''అంటే-మన్మథుడి సరుకన్నమాట! దాన్ని వేసుకోవడం-చెక్కుచెదరకుండా ఉండిపోవటాని క్కాదు! అప్పుడప్పుడు అలా, అలా, అలవోకగా జారవిడుచుకోవడానికి. సో...దుపట్టా వేసుకో! షాపుకెళ్ళు. నువ్వనుకున్నట్టే రెండోది ఉంటే బేరం చేసి కొనేయ్! కాకి చేత కబురు చెయ్! కట్టలు పట్టుకుని అక్కడ వాల్తాను.''

***

లత అరచేతిలోని కర్ణాభరణాన్ని రతన్‌లాల్ ఆశ్చర్యంగా చూశాడు.

''మేమ్‌సాబ్...ఇది ఎక్కడిది?'' అనుమానిస్తూ అడిగాడతను.


''ఇక్కడిదే! గంట క్రితం మావారు మీ దగ్గర కొన్నారు!''

''వాపస్ చేయడానికొచ్చారా? తీస్కోం! మరీ బల్వంతం చేస్తే ఫిఫ్టీపర్సెంట్ కట్ చేసి, తీస్కుంటాం!'' రతన్‌లాల్ తెలివిగా అన్నాడు.

లత పగలబడి నవ్వింది. ''మీరు పొరబడుతున్నారు! నాకు దీని జతది కావాలి! ఇయర్ సెట్ రెండు చెవులకీ పెట్టుకోవాలిగా!''

''ఇది యాంటిక్‌పీస్ మేమ్ సాబ్! మా దగ్గర ఒక్కటే ఉంది. అదే ఇది.''

''ఇది నాకు ఎంతో నచ్చింది సేఠ్ జీ! నాకు రెండోది కావాలి. ఎంత డబ్బైనా ఫర్వాలేదు!'' లత ఉత్సాహంగా అంది.





# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## వెలుగు కావాలి

''నాలుగు రోజులుగా ఈ గది తలుపులు మూసేవున్నాయి. ఎవరూ లోపలికి ప్రవేశించ లేదు. అవునా?'' అని అడిగాడు డిటెక్టివ్.

''అవునండి. తాళం చెవి నా దగ్గరే వుంది'' అన్నాడు యువకుడు.

ఇంటి యజమాని మరణించి నాలుగు రోజులవుతోంది. తన మరణం తర్వాత, సరిగ్గా నాలుగు రోజులకు, ఈ గది తలుపులు తెరిచి తన చిత్తరువు వెనక వున్న సేఫ్‌లోని డబ్బు వీలునామాలో సూచించినట్టుగా అందరూ పంచుకోవాలని ఫామిలీ లాయర్‌ను కోరాడాయన.

ఎత్తైన కిటికీ కింద వేళ్లాడుతోంది పోర్ట్రెయిట్. దానిమీద అలంకారం కోసం పూల కుండీలా ఒక మొక్కను పెంచారు. తమల పాకుల్లా కొనదేలిన పెద్దసైజు ఆకులు చిత్రం లోని మనిషికి కిరీటంలా కనిపిస్తున్నాయి.

పోర్ట్రెయిట్ వెనకనే వుందాయె సేఫ్. ఎక్కడ పడిపోతుందోనన్నే భయంతో పూలకుండీని జాగ్రత్తగా తీసి పక్కనపెట్టాడు లాయర్. కిటికీ లోపలినుండి మూసి వుంది. యువకుడు, సేఫ్ తెరిచి, ''అయ్యో, ఎవరో దోచేశారు. లోపల డబ్బుల్లేవు'' అంటూ అరిచాడు.

''అవును మరి. డబ్బు కొట్టేసింది నువ్వే కదా'' అన్నాడు డిటెక్టివ్.

''నాలుగు రోజులుగా నేను లోపలికే రాలేదు'' అంటూ అమాయకంగా చూశాడా యువకుడు.

''అబద్ధం'' అంటూ పోలీసులకు ఫోన్ చేశాడు డిటెక్టివ్.

యువకుడు అబద్ధమాడుతున్నాడని డిటెక్టివ్ ఎలా పసిగట్టాడు?

**సమాధానం:** కిటికీ, లోపల్నుండి మూసి వుంది. ఈ నాలుగు రోజుల్లో ఎప్పుడో సేఫ్ ఓపెన్ చేసి, పూలకుండీలో వున్న మొక్కను గోడకు తిప్పి పెట్టాడు. అందువల్లే ఆకులు చిత్తర్వు మీదికి వాలాయి. లేకపోతే, వెలుగు వచ్చే వైపు అంటే, కిటికీ వైపు తిరిగి వుండేవి.

''లేదు మేమ్ సాబ్! 'హర్ధం' చేస్కోండి....''

''మా ఆయనకు మూడు లక్షలకి దీన్ని అమ్మారు. దీని జతకు నేను నాలుగు లక్షలిస్తాను.''

రతన్‌లాల్ విసుగ్గా చూశాడు. ''అరే అమ్మగారూ....''

''మీ దగ్గర లేదు ఒప్పుకుంటాను. మీలాంటి వాళ్ళ దగ్గర ఎక్కడో అక్కడ దీని జంట నక్షత్రం ఉండి తీరాలి. మీ సర్కిల్స్‌లో ట్రై చేయండి....''

రతన్‌లాల్ బరువుగా, చప్పుడు చేస్తూ నిట్టూర్చాడు.

''నాలుగున్నర లక్షలు...అవసరమైతే ఐదు... ఐదు లక్షలు ఇస్తాను. నాకు సెట్ కావాలి!'' లత ఆత్రంగా అంది.

రతన్‌లాల్ ఆశ్చర్యంతో చూశాడు. తను తొందర పడి దీన్ని మూడు లక్షలకి అమ్మేశాడా?

''సేట్ జీ...చివరి ఆఫర్ చేస్తున్నా! ఆరు లక్షలయినా ఇచ్చేస్తాను. రాయల రాణివాసం 'ఇయర్ పీసెస్' నా చెవుల్లో అలంకరించుకోవాలి.''

రతన్‌లాల్ నమ్మలేనట్టు చూశాడు. ఆరులక్షలు...రెండు నక్షత్రాలూ తన వద్ద వుండి ఉంటే-తెలివిగా అమ్మగలిగి ఉంటే, తనకి పన్నెండు లక్షలు వచ్చి ఉండేవి.

''ఏమిటాలోచిస్తున్నారు, సేట్‌జీ! మార్కెట్లో ప్రయత్నం చేయండి. దీన్ని ఎక్కడ పట్టారో, అక్కడ కూడా ట్రై చేయండి. ఎంతకి దీన్ని కొన్నా నాకు అభ్యంతరం లేదు. నేను ఆరు లక్షలిచ్చేస్తాను.''

లత మాటలు రతన్‌లాల్ బుర్రలో ఆలోచనల్ని రేపుతున్నాయి. కదిపిన పుట్టలోంచీ లేచే కందిరీగల్లా ముసురుతున్న ఆలోచనల్ని బలవంతాన నిగ్రహించుకుంటూ, లత వైపు నిదానంగా చూశాడతను.

''హోటల్ ఎంపరర్' రూమ్ నెంబర్ టూ నాట్ టూ...దొరికితే వెంటనే నాకు ఫోన్ చేయండి.'' లత మాట రతన్‌లాల్‌లో మళ్లీ ఆలోచనల అలల్ని పుట్టించింది.

ప్రయత్నిస్తే తప్పేంటి? కష్టమే కానీ, ఖర్చు లేదుగా? దొరికితే బోల్డంత లాభం. దొరక్కపోతే నష్టం లేదు.

''ఓకే...మేమ్ సాబ్...ట్రై చేస్తాం...''

''థాంక్యూ! ఇక్కడ మరో వారం రోజులుంటాం. ఈలోగా దీని జంట కోసం మీరు గాలించాలి.''

''జరూర్ జరూర్... మీదీ మొబైల్ నెంబర్ ఇవ్వండి'' రతన్‌లాల్ ఉషారుగా అన్నాడు.

***

రెండు రోజులు గడిచాయి. మార్కెట్లో ఉన్న తన మిత్రుల్నీ, శత్రువుల్నీ వాకబు చేశాడు రతన్‌లాల్. విజయనగరం కర్ణాభరణం గురించి కనీసం విన్నవాళ్ళు కూడా లేరు. ఆర్నెల్ల క్రితం తనకు అమ్మిన వ్యక్తి చచ్చిపోయాడు. ఎవరి వద్దన్నా ఉండిఉంటే ఏ లక్షో, రెండు లక్షలో పారేసి కొని ఉండేవాడు. ఆరు లక్షలకి ఆ లతకి అమ్మేసి దండిగా దండుకుని ఉండేవాడు.

ఆలోచనల్ని ఆపుకుంటూ, మోగుతున్న టెలిఫోన్ రిసీవర్ని అందుకున్నాడు రతన్‌లాల్. ''నవరత్న మందిర్....''

''సేట్ జీ నేను లతని. ఇయర్ స్టార్ దొరికిందా?'' అవతలి వైపు కంఠం.

''సారీ మేమ్ సాబ్....కాలా బజార్లో కూడా అడ్డీ చూశామ్...''

''ట్రై చేయండి సేట్‌జీ! తీవ్రంగా ప్రయత్నించండి.''

''మేమ్‌సాబ్...ఒక పని చేద్దాం...మీరు సరే అంటే, అలాంటి స్టార్ మేమే తయార్ చేయించి...''

''నో! నాకు అలాంటి హంపీ డైమండ్ ఇయర్ స్టారే కావాలి. ఐ వాంట్ ద ఒరిజినల్ పీస్!'' లత అడ్డు తగుల్తూ అంది. ''ఇంకా అయిదురోజులుంటాం. ట్రై హార్డ్!''

రతన్‌లాల్ విసుగ్గా రిసీవర్ని పడేశాడు. వెంటనే మోగడం ప్రారంభించింది ఫోన్.

''నవరత్న మందిర్!''

''ప్రొప్రయిటర్ రతన్‌లాల్ కావాలి!'' అటు వైపు కంఠం బొంగురుగా అంది.

''రతన్‌లాల్ జీ స్పీకింగ్! ఆప్ కౌన్ హై?''

''మిస్టర్ రతన్‌లాల్! నా పేరు రాజా చంద్రహాస పాత్రో....'హై సొసైటీ' టీవీ ప్రోగ్రాంలో మీ ఇంటర్వ్యూ చూశాను. మీ దగ్గర అమ్మకానికి సిద్ధంగా ఉన్న హంపీ విజయనగర డైమండ్ ఇయర్ రింగ్ మాకు కావాలి..''

''సారీ...సాబ్...దాన్ని మొన్నే అమ్మేశాం...'' రతన్ లాల్ అన్నాడు.

''అమ్మేశారా? ఎవరికి? దీని జత నక్షత్రం మా వద్ద ఉంది. చాలా ఏళ్ళ క్రితం ఒకటి పోయింది. మీ వద్దకు చేరింది అదే. టీవీలో చూడగానే కనిపెట్టాం. ఇక్కడకి రావడం ఆలస్యం చేసి తప్పు చేశాం...''

రతన్‌లాల్ గుండె దడదడ కొట్టుకుంది. విజయనగర్ డైమండ్ ఇయర్ స్టార్...ఉందా? తను సరిగ్గా విన్నాడా? ''పాత్రో సాబ్ మీదీ దెగ్గిరా రెండో స్టార్ ఉందా?!''

''ఉంది. అందుకే మీ వద్ద ఉన్నదాన్ని కొనుగోలు చేయాలనుకున్నాం. ఒక్క స్టార్‌ని ఏం చేయగలం? ఒక చెప్పుని తొడుక్కోలేం! ఒక ఇయర్ రింగుని పెట్టుకోలేం.''

''పాత్రో సాబ్....ఠీక్‌గా చెప్పినార్! మీ దగ్గరున్న దాన్ని మాకు అమ్ముతార్?'' రతన్‌లాల్ ఆత్రుతగా అడిగాడు.

''మీ వద్ద అమ్మకానికున్న దాన్ని కొనడానికీ, మా వద్ద ఉన్న దాన్ని అవసరమైతే అమ్మడానికే ఈ ఊరొచ్చాం...''

''ఓహ్! ఠీక్ హై! మేం మిమ్మల్ని అర్జెంటుగా మిలాకాత్ కావాలి!''

''హోటల్ సంగీతకి రండి. రాజా చంద్రహాస్ పాత్రోగారు కావాలని అడగండి.!''

***

''మిస్టర్ రతన్‌లాల్...చరిత్రలో మీరు చదివే ఉంటారు. శ్రీకృష్ణదేవరాయలు ఒరిస్సాలోని పాత్రోలతో సంబంధ బాంధవ్యాలు నెరిపారు. ఆ బంధుత్వంతో నక్షత్ర వజ్ర కర్ణాభరణాలు రెండు మా వంశానికి కానుకగా లభించాయి. కాలం గడుస్తూ వచ్చింది. ఒక నక్షత్రం పోయింది. మీవద్దకు చేరిందని తెలిసి, తెగ సంతోషపడిపోయాం. దాన్ని కొనా

లనీ, లేదంటే మా వద్ద ఉన్న దాన్ని అమ్మాలనీ నిర్ణయించుకుని వచ్చాం!" పచార్లు చేస్తూ చెప్పుకు పోతున్న రాజా చంద్రహాస పాత్రో భారీ విగ్రహాన్ని గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు రతన్‌లాల్.

పొడుగాటి, గంభీరమైన ఆకారం, చెంపల వద్ద తెల్లబడుతున్న గిరజాల జుట్టు, సన్నగా మెలి తిరిగిన మీసాలు. పైజమా, కుర్తా, భుజం మీంచీ పొడుగ్గాజారి, నేలమీద జీరాడుతున్న జరీఅంచు అంగవస్త్రం...పాత్రో నడకలో ఠీవీ, మాటలో హుందా, గత వైభవం కళ్ళకు కట్టుతోంది.

"రాజా సాబ్...మీ సరుకుని మేం కొంటాం... ఒకసారి చూపిస్తార్?"

రాజా చంద్రహాస పాత్రో పచార్లు ఆపి, సోఫాలో కూచున్నాడు. కుర్తా జేబులోంచీ చిన్న ముఖమల్ గుడ్డ సంచీ తీశాడు. సంచీని రతన్‌లాల్ వైపు విసిరాడు. రతన్‌లాల్ సంచీని పట్టుకుని, విప్పి, అందులో ఉన్న స్టార్‌ని కుడి చేతిలోకి వేసుకున్నాడు. అతని గుండె దడదడ కొట్టుకుంది. సందేహం లేదు. ఇన్నాళ్ళూ తన ఆధీనంలో ఉన్న దాని కవలే ఇది. అయితే ఈ నక్షత్రానికి నాలుగు మొనలు చక్కగా ఉన్నాయి. అయిదవది విరిగి పోయి ఉంది.

"ఆ ముక్క ఎప్పుడో, ఎక్కడో విరిగిపోయింది. కాస్తంత బంగారంతో దాన్ని పూర్వ రూపానికి తెచ్చుకోవచ్చు!" రతన్‌లాల్ చూపుల్ని గమనిస్తూ అన్నాడు చంద్రహాసపాత్రో.

"ఎంతైనా అతుకు అతుకే, పాత్రో సాబ్! ఎంత ఇమ్మంటార్?" రతన్‌లాల్ తెలివిగా అన్నాడు. రాజ్యాలు పోయాక, రాజవంశీకులు-తరాజుల్లై పోయారు. తెగనమ్ముకోవడంలో సిద్ధహస్తులై పోయారు. చవగ్గా చేతిలోకి వచ్చే లక్షణాలు కనిపిస్తున్నాయి.

"ఎంతిస్తారు?" రాజ చంద్రహాస పాత్రో పైప్ వెలిగించి ఊదుతూ అన్నాడు.

"లక్ష! అది కూడా మీ మొహం చూసి!"

"రతన్‌లాల్ ! నా ముఖానికి విలువకట్టొద్దు! అది నీ వల్ల కాదు! వజ్రానికి కట్టు, విలువ!" రాజా చంద్రహాసపాత్రో గంభీరంగా అన్నాడు.

"మాఫ్ కర్నా...లక్షన్నర ఇస్తాం..."

పాత్రో లేచి నిలుచున్నాడు. రతన్‌లాల్ కూడా వెంటనే లేచాడు. పాత్రో ఎడమ చేయి ముందుకు చాచాడు. స్టార్ని ఇమ్మన్నట్టుగా.

"ఠీక్ హై సాబ్...రెండు లక్షల్..."

పాత్రో రతన్‌లాల్ చేతిలోంచీ స్టార్‌ని అందుకుని పిడికిటిలో బంధించాడు.

"గుడ్‌బై రతన్‌లాల్! థ్యాంక్స్ ఫర్ కమింగ్!"

"రాజా సాబ్...మీరే చెప్పండి...విని, వెళ్లిపోతాం!"

"అక్షరాలా అయిదు లక్షలు!"

రతన్‌లాల్ బిక్క మొహం వేసి, తలను అటూ ఇటూ తిప్పాడు. "అంత చేయదు రాజా సాబ్...."

"చేయకపోతే, నేనేం చేయలేను! కావాలంటే అయిదిచ్చి పట్టుకెళ్ళండి! లేదంటే వాట్టి చేతుల్తో వెళ్ళండి..." రాజా చంద్ర హాస పాత్రో నవ్వుతూ అన్నాడు. "అమ్మే వస్తువు విలువ తెలుసుకోకుండా వచ్చామని మీరు అనుకుంటున్నారు. ఇది ఒక విధంగా అమూల్యం!"

"ఫైనల్ ఆఫర్...మూడు లక్షల్ ఇస్తాం రాజా సాబ్!"

రాజాచంద్రహాస పాత్రో నగని జుబ్బా జేబులో పడేసుకున్నారు.

"సరే...నాలుగు..."

పాత్రో నవ్వుతూ రతన్‌లాల్ భుజం మీద చెయ్యి వేసి, గుమ్మం వైపు నడిచాడు. తలుపు తెరిచి, అతన్ని బైటికి వెళ్ళమన్నట్టు సైగ చేశారు. రతన్‌లాల్ కదలకుండా పాతిన రాతిలా అలాగేనిలబడి పోయాడు. అయిదు ఇచ్చేస్తే, లతకి ఆరుకి అమ్మేస్తే, తనకి మిగిలేది లక్షే! ఏడు లక్షలైనా పారేసేలా ఉందామె! ఇక్కడ రాజాసాబ్ రేటు పెంచినట్టే, అక్కడ తనూ రేటు పెంచుతాడు!

"అచ్ఛాసాబ్...మిమ్మల్నీ, మీ వంశగౌరవాన్నీ దృష్టిలో ఉంచుకొని, అయిదు లక్షల్ ఇచ్చేస్తాం. ఏం చేస్తాం!"

"ఇంత సేపటికి 'పోతు కూత' కూశావ్, రతన్‌లాల్ ! క్యాష్ రెడీగా ఉందా?" రతన్‌లాల్‌ని గది మధ్యకు నడిపిస్తూ అన్నాడు రాజాచంద్రహాస పాత్రో.

"మా అసిస్టెంట్ బ్రీఫ్ కేస్‌తో కింద రెడీగా ఉన్నాడు సాబ్!" రతన్‌లాల్ భరోసా ఇచ్చాడు.

***

హోటల్ ఎంపరర్ ముందు కారాగింది. సేఠ్ రతన్‌లాల్ ఆదరా బాదరా కారు దిగి, రిసెప్షన్ వైపు గాలిలో తేలుతున్నట్లు అడుగులు వేశాడు.

"మేడమ్ లతాజీ...రూమ్ నెంబర్ టూ నాట్ టూ!" రిసెప్షనిస్టుతో ఉషారుగా అన్నాడతను.

"మిసెస్ లత? నిన్ననే గది ఖాళీ చేసి వెళ్లిపోయారు!" రిసెప్షనిస్ట్ చిరునవ్వు నవ్వుతూ అంది.

"నో...నో... ఇవాళ ఉదయం కూడా మేం ఫోన్ చేసి ఆమెతో మాట్లాడేం!" రతన్‌లాల్ అన్నాడు.

"హోటల్ నెంబరా? ఆమె మొబైలా? దేనికి చేశారు?"

"మొబైల్‌కే..."

రిసెప్షనిస్టు నవ్వింది. "మొబైల్లో ఎక్కణ్నుంచైనా మాట్లాడొచ్చు, ఎక్కడ ఉన్నట్టయినా చెప్పుకోవచ్చు! లతగారూ, ఆమె భర్తా, నిన్న ఉదయమే వెళ్ళిపోయారు."

"ఎక్కడికి? ఎక్కడికి పోయార్?" రతన్‌లాల్ బలహీనంగా అడిగాడు.

"తెలీదు."

రతన్‌లాల్ నీరసంగా అడుగులు వేస్తూ బయటకి నడిచాడు.

***

రతన్‌లాల్ తన ఏసి గదిలో కూచుని లత ఇచ్చిన మొబైల్ నెంబర్ డయల్ చేశాడు. పదకొండోసారి! 'స్విచ్ఛాఫ్ చేసి ఉంది' అంటోంది స్టయిల్‌గా ఎవరో అమ్మాయి కంఠం.

ఏసీని వెక్కిరిస్తూ, రతన్‌లాల్ శరీరాన్ని చెమటలు కమ్ముతున్నాయి. లత ఏమైంది? అంతగా అడిగి, రెండో ఇయర్ పీస్ తీసుకోకుండా ఎక్కడికెళ్ళింది? చేతులారా ఒకదాన్ని మూడు లక్షలకి అమ్మాడు తను. లత ఆత్రుతను నమ్మి, చేతులారా దీని కవలను అయిదు లక్షలు పోసి కొన్నాడు! రతన్‌లాల్ చెమట పట్టిన ముఖాన్ని తువ్వాలుతో అద్దుతూ నిట్టూర్చాడు. జత స్టార్ దొరికిందని తను స్వయంగా ఫోన్ చేసి, చెప్పాడు. ఆమె ఆనందంగా



## శ్రియ తీరని కోరిక....!

ప్రస్తుతం ఉన్న హాటెస్ట్ హీరోయిన్లలో శ్రియదే అగ్రస్థానం. రకరకాల పాత్రలతో ఇటు దక్షిణాదిని, అటు ఉత్తరాదిని ఓ ఊపు ఊపుతున్న శ్రియకు తీరని కోరిక ఒకటుందట! రకరకాల పాత్రలు చేయాలనో లేదా, ఇంకా ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకోవాలనో కాదట! ఓ వ్యక్తి పక్కన నటించాలన్నదే శ్రియ చిరకాల కోరిక. దక్షిణాదిలో ఇప్పటి వరకూ దాదాపు అందరి అగ్రహీరోల సరసన నటించిన శ్రియ ఒక్క కమల్‌హాసన్ పక్కన నటించలేదు. కమల్ పక్కన నటించి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకోవాలనుకున్న తన కోరిక ఇప్పటి వరకూ తీరలేదు అంటూ బాధను వ్యక్తం చేసింది. 'ఎప్పటికైనా నా కోరిక తీరుతుందన్న నమ్మకం నాకుంది' అంటోంది. 'జ్యోతిక రజనీకాంత్‌తోనూ, కమల్‌హాసన్‌తోనూ నటించి, మంచి పేరు తెచ్చుకుంది. నేను కూడా ఏదో ఒక రోజున కమల్ పక్కన నటిస్తాను' అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది.

పెట్టిన కేక ఇంకా తన చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

రెండు గంటలు గడిచాయి. ఫోన్ మోగలేదు. లత కొంటుందన్న నమ్మకం మెల్లి మెల్లిగా కరిగి పోతోంది. ఆ పిల్లని నమ్మి అయిదు లక్షలు పోసి రెండో దాన్ని కొన్నాడు. దీని విలువ మూడు లక్షలు దాటదని తనకు తెలుసు. నష్టపోకుండా ఉండా లంటే ఏం చేయాలి? రాజాచంద్రహాస పాత్రోవద్ద కొన్న స్టార్ని అతనికి వాపసు చేసి, తన సొమ్ము రాబ ట్టుకోవాలి!అంతే!''

రతన్‌లాల్ రిసీవర్ ఎత్తి, హోటల్ సంగీతా నంబర్ డయల్ చేశాడు. రాజాచంద్ర హాసపాత్రో గారికి కనెక్ట్ చేయమన్నాడు.

''పాత్రో గారు గది ఖాళీ చేసి వెళ్ళిపోయారు. మూడు గంటలైంది'' రిసెప్షనిస్ట్ నిర్లక్ష్యంగా చెప్పి కనెక్షన్ కట్ చేశారు.

సేఠ్ రతన్‌లాల్ చేతిలోంచీ రిసీవర్ జారి పడింది.

***

నల్లత్రాచులా వొంపులు తిరిగిన కారు రోడ్డు మీద వయ్యారంగా పరుగెడుతోంది. శివరామ్ వేళ్ళు స్టీరింగ్‌ని చాకచక్యంగా తిప్పుతున్నాయి.

''నాతో మాట్లాడొద్దు!'' వెనకసీట్లోంచీ లత కోపంగా అంది.

''ఎందుకు?''

''నేను నీతో మాట్లాణ్ణు!''

''ఎందుకు?''

''తెలీదా? నటించొద్దు!'' లత కసిరింది. ''తెచ్చి నట్టే తెచ్చి, ఇచ్చినట్టే ఇచ్చి, విజయనగర వజ్రం కర్ణ-ఆభరణాన్ని తీసుకున్నావ్! కొసరుగా నా మొబైల్ లాగేసుకున్నావ్! ఆ డైమండ్ నక్షత్రాన్ని ఏం చేశావ్.''

''అమ్మేశాను! లాభానికి!''

''వాట్? పిచ్చిపట్టిందా?''

శివరామ్ మాట్లాడకుండా బ్రీఫ్‌కేస్‌ని వెనక సీటు మీదికి విసిరాడు. ''తెరిచి చూడు!''

లత్ బ్రీఫ్ కేస్‌ని తెరిచి చూసి, చిన్నగా కేక పెట్టింది. ''ఎంత?''

''అయిదు లక్షలు మాత్రమే!''

''గుడ్ గాడ్! ఎవరికి అంటగట్టావ్?''

''శివరామ్ రూపంలో వెళ్ళి రతన్‌లాల్ దగ్గర మూడు లక్షలకి కొన్నాను. రాజా చంద్రహాస పాత్రో అవతారం ధరించి, అతన్ని రప్పించుకొని, దాన్నే అయిదు లక్షలకి అంటే రెండు లక్షలకు నికరలాభా నికి అమ్మిపారేశాను.''

''అయితే ఆ హంపీ విజయనగరం వజ్రం బహుమతి ఇవ్వడం అంతా నాటకమన్నమాట!'' లత కోపం నటిస్తూ అంది.

''హనీ, మన నటననూ జీవితాన్నీ వేరు చేసి చూడొద్దు! జగన్నాటకంలో జీవితమే నటన! నటనే జీవితం!'' శివరాం నవ్వుతూ అన్నాడు. ''టీవీలో ప్రోగ్రామ్ చూడగానే మన బుర్రలో మెరుపు మెరి సింది. ముందస్తుగా జాగర్తపడి కొనేశాను. నీకు ప్రజెంట్ చేశాను. రెండోది కావాలని నువ్వు మొండి కేస్తావని నాకు తెలుసు! నీ బేరం సహజంగా రాణిం చాలన్న ఉద్దేశంతో నీకు నా పథకం గురించి చెప్ప లేదు.''

''డార్లింగ్..రతన్‌లాల్ దాన్ని పోల్చుకోలేదా?'' లత కుతూహలంగా అడిగింది.

''అతను మొదటి దాని కవల కోసం వెయ్యి కళ్ళతో చూస్తున్నాడు. చెవులకి పెట్టే నగలు నిజం గానే కవలల్లా ఉంటాయిగా! అయినా, ఎందుకైనా మంచిదని నక్షత్రానికున్న అయిదు మొనల్లో ఒక దాన్ని కొద్దిగా విరగ్గొట్టాను! రతన్‌లాల్ పడి పోయాడు.'' శివరామ్ నవ్వుతో, సగర్వంగా అన్నాడు.

''డార్లింగ్, రతన్‌లాల్ మీద ప్రత్యేకించి నీకు పగ దేనికి?''

''పగా లేదూ, పట్టింపూ లేదు! కాకపోతే తన దగ్గరున్న ఆ ఇయర్‌పీస్‌కి హంపి విజయనగరం, రాయలవారి రాణివాసం అంటూ బిల్డప్ ఇచ్చి, నాటకం ఆడాడతను. అదంతా సేల్స్ టాక్. 'యాంటిక్ టచ్' ఇచ్చి కస్టమర్‌కి వజ్రంతో వాత పెట్టాలనుకున్నాడు.''

''కానీ...అతని వజ్రంతో అతనికే వావత పెట్టాడు శివరామ్!'' లత నవ్వుతూ అంది.

''అలక తీరిందిగా! ఇంక వెనక ఎందుకు? ముందు రా హనీ!'' అన్నాడు శివరాం కార్ని మలుపు తిప్పుతూ...

*

